సాక్షి
జగిత్యాల
గురువారం । 30 । నవంబర్ । 2023



అక్షరాలా.. రూ.50 కోట్లు

గల్లీ నుంచి ఢిల్లీ పెద్దల దాకా ఏ సభ చూసినా మహిళా సంఘాలదే హవా. ప్రధాన పార్టీల ప్రచార పర్వంలో ఈ ఎన్నికల్లో మహిళా సంఘాల పాత్ర కీలకంగా మారింది. 2లో▸



బాధితుడి వైద్యానికి సాయం

ధర్మపురి మండలకేంద్రంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన దివిటి సురేశ్ వైద్యానికి సామాజిక మిత్రులు ఆర్థిక సహాయం అందించారు. 2లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/18.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై కనిపిస్తుంది. సాయంత్రం, రాత్రి వేళ చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఏఎస్పీ



ధర్మపురి: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ధర్మపురిలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తన ఓటును వినియోగించుకున్నారు.

లండన్‌లో కేసీఆర్ దీక్ష దివాస్



దీక్ష దివాస్‌లో పాల్గొన్న సభ్యులు

రాయికల్: కేసీఆర్ దీక్ష దివాస్‌ను లండన్‌లో ఎన్‌ఆర్‌ఐ బీఆర్‌ఎస్ యూకే ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కేసీఆర్ శాంతియుతంగా చేపట్టిన పోరాటమే నేడు తెలంగాణ రాష్ట్రమని తెలిపారు. తెలంగాణ గాంధీజీ కేసీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో సభ్యులు రవి, ప్రదీప్, సురేశ్, హరిగౌడ్, సతీశ్‌రెడ్డి, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రశాంత్, శ్రీకాంత్, నవీన్ పాల్గొన్నారు.

ఘనంగా పడిపూజ



పడిపూజ చేస్తున్న భక్తులు

ధర్మపురి: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో 17వ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం అయ్యప్ప అరట్టు, పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు భీమనాథి మంగాఅశోక్ ఆధ్వర్యంలో గురుస్వాములు పెండాల బాలకృష్ణశర్మ మంత్రోచ్ఛరణల మధ్య గణపతి, అయ్యప్ప, కుమార స్వాములకు ప్రత్యేక పూజలు జరిపారు. ముందుగా శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం నుంచి గోదావరికి మేళతాళాలతో బయలుదేరి ముగ్గురు స్వాములకు గంగాజలాలతో అభిషేకం చేశారు. పురవీధుల మీదుగా ఊరేగింపుగా తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం వందలాదిమందికి అన్నదానం చేశారు.

అయితే ఫోన్ పే.. లేకుంటే గూగుల్ పే

జగిత్యాల: గురువారం ఓటింగ్ జరగనుండటంతో ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటు వేసేందుకు రావాలని ప్రజలను వేడుకుంటున్నారు. వారికి వచ్చిపోయే ఖర్చులను సైతం అభ్యర్థులు భరిస్తున్నారు. ఇందుకు ఫోన్ పే, గూగుల్ పేల ద్వారా డబ్బులు పంపిస్తున్నారు. దీంతో విద్య, ఉపాధి తదితర పనుల నిమిత్తం వివిధ ప్రాంతాల్లో ఉంటున్న ఓటర్లు సొంతూళ్లబాట పట్టారు. అభ్యర్థుల పిలుపు మేరకు పోలింగ్ రోజే చేరేలా చూసుకుంటున్నారు. జిల్లా నుంచి ఎక్కువ శాతం ప్రజలు హైదరాబాద్‌లో ఉన్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ ఉన్నారు. సాఫ్ట్‌వేర్లతోపాటు, వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారికి రాకపోకల ఖర్చులు చెల్లిస్తుండటంతో వారు వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఒక్క ఓటు కూడా ఎంతో విలువైంది కాబట్టి ప్రతిఒక్కరూ అవి తమకే పడేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అధికారులు సైతం ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని చైతన్యం తీసుకొచ్చిన విషయం తెల్సిందే. దాదాపు ప్రతి నియోజకవర్గ నుంచి అనేక మంది సుదూర ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ నియోజకవర్గాన్ని మొత్తం చుట్టిరావడంతో పాటు, ప్రతి ఓటరును కలిసి వచ్చారు.

ఆకర్షణీయంగా పోలింగ్ కేంద్రాలు



జగిత్యాల: పోలింగ్ శాతం పెంచాలనే ఉద్దేశంతో అధికారులు మొదటి నుంచి ఓటర్లకు అవగాహన కల్పిస్తూ వచ్చారు. ప్రతి నియోజకవర్గంలో ఐదు మహిళ, ఐదు మోడల్, ఒకటి దివ్యాంగ, ఒకటి చొప్పున యూత్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిని సుందరంగా తీర్చిదిద్దారు. ఆకర్షణీయంగా ఉండటంతో మహిళలు, దివ్యాంగులు, యూత్ ఓటు వేసే అవకాశం ఉంది.

ఓటుకు వేళాయె



వజ్రాయుధం.. వినియోగించేది నేడే

- ప్రజలందరూ ఓటు వేయాలి
- ఉమ్మడి జిల్లాలో పోలింగ్‌కు పూర్తయిన ఏర్పాట్లు
- 216 మంది అభ్యర్థులు
- 729 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది వివరాలు

జిల్లా	సమస్యాత్మక కేంద్రాలు	పోలింగ్ సిబ్బంది	పోలీసులు	ఫోన్ నంబర్
కరీంనగర్	289	4,872	5,020	8500666768
జగిత్యాల	248	4,616	3,000	7995084601
పెద్దపల్లి	115	3,352	4,202	7995070700
రాజన్నసిరిసిల్ల	77	3,542	1,650	9849905881



డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద సిబ్బంది హడావుడి



పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది



జగిత్యాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు



కేంద్రాలకు వెళ్తున్న పోలీసు బలగాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రజాస్వామ్యంలో అత్యంత బలమైన పౌరహక్కుల్లో మొదటిస్థానంలో నిలిచేది ఓటుహక్కు. దీన్ని ప్రజలు స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల జిల్లాల కలెక్టర్లు, సీపీ/ఎస్పీలు చర్యలు తీసుకుంటున్నారు. సాధారణ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మంథని వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకే ముగియనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 729 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. వీటిలో గరిష్ఠంగా కరీంనగర్‌లో 289, కనిష్ఠంగా సిరిసిల్లలో 77 ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ఎలాంటి అలజడులకు తావులేకుండా ముందు జాగ్రత్తగా అదనపు బలగాలను మోహరించారు. నాలుగు జిల్లాల్లో కలిపి, 13,872 మంది పోలీసులకు విధులు కేటాయించారు. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీలతోపాటు ఏఐఎఫ్‌బీ వంటి చిన్న పార్టీలు, ఇండిపెండెంట్లు కలిపి మొత్తం 216 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. వీరందరి రాజకీయ భవితవ్యం తేల్చేందుకు ఓటర్లు గురువారం ఓటేయనున్నారు. ఇందుకోసం అధికారులు 3,417 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సొంతూరులో ఓటేసేందుకు హైదరాబాద్, ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి కూడా మాతృభూమికి ఓటర్లు తరలివస్తుండటం విశేషం.



కోరుట్ల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



రిటర్నింగ్ అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా



ఎన్నికల సామగ్రిని తీసుకుంటున్న అధికారులు, సిబ్బంది

ఓటర్లు ఇవి పాటించాలి..

- ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలుసుకునేందుకు ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్ లేదా సీ–విజిల్ యాప్ వినియోగించుకోవచ్చు.
- పోలింగ్ కేంద్రం వద్ద పార్టీల గుర్తులు, రంగుల దుస్తులు, టోపీల వంటివి ధరించకూడదు.
- బూత్ లోపలికి సెల్‌ఫోన్లు తీసుకెళ్లకూడదు.
- ఒకవేళ జాబితాలో పేరు ఉండి, ఓటరు కార్డు లేకపోతే ప్రభుత్వం సూచించిన ఆధార్, పాన్ కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, పెన్షన్, బ్యాంక్ ఖాతా పుస్తకం, ఉపాధి హామీ కార్డు తదితర 12 రకాల కార్డుల్లో ఏదోటి చూపాలి.
- ఈవీఎం బటన్ నొక్కిన తర్వాత మీరు ఓటేసిన గుర్తు అక్కడి తెరపై ఏడు సెకన్లపాటు కనిపిస్తుంది. అలా మీ ఓటుని నిర్ధారించుకోవచ్చు.
- ఓటు వేయడంలో ఏవైనా ఇబ్బందులున్నా, మీ ఓటు మరొకరు వేసినా.. వెంటనే పోలింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేయొచ్చు.
- ఒక్కసారి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లాక ఓటు వేసేందుకు ఎంత సమయమైనా అధికారులు మీ ఓటు తప్పకుండా తీసుకుంటారు.

గత పోలింగ్ శాతం దాటేనా?

2018 ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ పోలింగ్ జరిగింది. కరీంనగర్‌లో 69.29, చొప్పదండి 79.73, మానకొండూరు 85.36, హుజూరాబాద్ 84.40, హుస్నాబాద్ 83.97, కోరుట్ల 75.84, జగిత్యాల 78.83, ధర్మపురి 80.19, రామగుండం 71.94, మంథని 85.41, పెద్దపల్లి 84.08, వేములవాడ 80.62, సిరిసిల్లలో 80.88 శాతం పోలింగ్ నమోదైంది. ఆయా నియోజకవర్గాలను పరిశీలిస్తే ఇది కరీంనగర్‌లో అత్యల్పం, మంథనిలో అత్యధికంగా ఉంది. కరోనా తర్వాత స్మార్ట్ ఫోన్లు, డేటా వినియోగం పెరిగింది. దీంతో ప్రభుత్వం ఎన్నికలు, ఓటుహక్కు వినియోగంపై చేసిన ప్రచారం కారణంగా గతంలో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం పెరుగుతుందని అధికారులు ధీమాగా ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలు..

కరీంనగర్‌లో 390, చొప్పదండిలో 327, మానకొండూరులో 316, హుజూరాబాద్‌లో 305, రామగుండంలో 259, మంథనిలో 288, పెద్దపల్లిలో 290, వేములవాడలో 170, సిరిసిల్లలో 287, కోరుట్లలో 262, జగిత్యాలలో 254, ధర్మపురిలో 269 మొత్తం 3,417 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ప్రణాళిక

- మూడు వేల మంది పోలీసులతో బందోబస్తు
- ఎన్నికల ఉల్లంఘనులపై 40 కేసులు నమోదు
- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ వెల్లడి



కోరుట్ల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: జిల్లాలో పటిష్టమైన ప్రణాళికతో.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఆయా శాఖల సమన్వయంతో కలిసి పనిచేస్తున్నామని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకునే ప్రణాళికతో ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు సుమారు మూడు వేల మంది జిల్లా, కేంద్ర పోలీస్ బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి మండలానికి సీఐ స్థాయి అధికారితో ప్రత్యేక పెట్రోలింగ్ పార్టీలు, 94 రూట్ మొబైల్స్, 37 క్విక్ రియాక్షన్ టీమ్స్, స్ట్రయికింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్స్, 10 బీఎస్‌ఎఫ్ కంపెనీల కేంద్ర బలగాలు, మహారాష్ట్ర హోంగార్డ్స్ 800 మంది, ఆర్టీసీ, ఏపీ పోలీస్ 160 మంది, సీఐడీ పోలీస్ 46 మందితోపాటు, పోలింగ్ స్టేషన్లో 347 మంది ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లను వినియోగిస్తున్నామని తెలిపారు. జిల్లాలో మొత్తం 927 పోలింగ్ స్టేషన్లు ఉండగా.. సాధారణ పోలింగ్ స్టేషన్లు 676, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 251 ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు నగదు రూ.2,59,17,681 నగదు, రూ.31,89,467 విలువైన 6,709 లీటర్ల లిక్కర్, రూ.1,56,38,048 విలువైన చీరెలు, పెట్టికోట్స్, వైట్‌షర్ట్స్, హ్యాండ్‌బ్యాగ్స్, హాట్‌బాక్స్, కుట్టుమిషన్లు, ఇతర సామగ్రి ఉన్నాయని తెలిపారు. సీజ్ చేసిన నగదు, లిక్కర్, గోల్డ్, ఇతర వస్తువుల విలువ మొత్తం విలువ రూ.4,63,03,410 ఉంటుందని తెలిపారు. జిల్లాలో మొత్తం 44 ఆయుధాలు డిపాజిట్ చేసినట్లు పేర్కొన్నారు. 3,418మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సిద్ధం

జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ కోరారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలివెళ్లరాదని, ఓటును వినియోగించుకోవడానికి వచ్చినవారితో మర్యాదపూర్వకంగా ఉండాలని, అనవసర విషయాలు చర్చించవద్దన్నారు. సెల్ఫీలు దిగడం నిషేధమన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ అదనపు ఎస్పీ ఆర్.జనార్దన్‌రెడ్డి, డీఎస్పీ వెంకటస్వామి, టౌన్ సీఐ నటేశ్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్త్ మధ్య ఈవీఎంల తరలింపు

ఈవీఎంలు, సామగ్రిని పటిష్ట బందోబస్త్ మధ్య తరలించినట్లు ఎస్పీ అన్నారు. కోరుట్లలోని ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను బుధవారం ఎస్పీ పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఆయా ప్రాంతాలకు ఎన్నికల సామగ్రి పటిష్ట బందోబస్త్ మధ్య తరలించామన్నారు.

మనసు ఊరుకోక ‘లేఖ’..

సిరిసిల్ల: కాలం కరిగిపోతోంది.. మరో అయిదేళ్లు మనల్ని పాలించే ప్రతినిధులను ఎన్నుకునే రోజు రానే వచ్చింది. నేడు ఓట్ల పండుగ. ఈ ఒక్కరోజు ఓటరుగా మీరు రాజు. నిస్వార్థ ప్రజాసేవకుడిని ఎన్నుకోండి. మా గుర్తుకు ఓటేయండి అంటూ ఎన్నికల్లో పోటీ చేసేవారంతా మైకు.. ఎల్‌ఈడీ స్క్రీన్లు పెట్టి అభివృద్ధి.. చేస్తామన్న పనులు వివరించారు. ఓటర్ల చుట్టూ చేరి, చేతులు జోడించి ఓటు అడిగారు. కాళ్లు మొక్కుతామన్నారు. మీరు గెలిపించకపోతే ప్రాణాలు తీసుకుంటామన్నారు. అయిదేళ్లకోసారి వచ్చే అరుదైన అవకాశం ఇదే.. లే.. లే.. నిర్లక్ష్యాన్ని వీడు. పోలింగ్ స్టేషన్ వైపు నడువు. ఓటనే వజ్రాయుధాన్ని సంధించు. నీ ఓటు మంచి పాలనకు బాట కావాలి. స్వార్థపరులకు వేటవ్వాలి. ఎన్నికల వేళ నీ ఓటు ఎంత అమూల్యమైందో గుర్తించు. ఎన్నికల రోజు కావడంతో నా మనసు ఊరుకోలేక ఇదంతా చెబుతున్నా.. ఇంతకూ నేనెవరో మీకు చెప్పనే లేదు కదా.. మిమ్మల్ని కన్న మీ పల్లె తల్లిని. మీ క్షేమం.. నా అభివృద్ధిని కాంక్షిస్తూ ఓ మంచి మాట చెబుదామని మీ ముందుకొచ్చిన.

– అరచేతిలో వైకుంఠం చూపించే మాటల గారడీ నేతలను నమ్మకండి. మనీకో, మద్యం సీసాకో ఓటు అమ్మకండి. తస్మాత్ జాగ్రత్త. కులం, ప్రాంతం, ప్రగతి పాఠాలను బోధిస్తూ మీ ముందుకొచ్చిన నాయకుల అసలు రూపం గమనించండి. లోతుపాతుల్ని.. ఆ మాటల వెనక ఉన్న నయవంచన గుర్తించండి. మీకు, మీ అందరికీ నీడనిచ్చిన నాకు జరిగింది ఏమిటి? ఒక్కసారి ఆలోచించండి. ఎన్నికల్లో ఎన్నెన్నో హామీలిచ్చి గెలిచాక ఒక్కసారైనా మీ ముఖం చూడని వారిని గెలిపించాల్నా? మన నియోజకవర్గ సమస్యల్ని, మన బాధలను పట్టించుకోకుండా కాంట్రాక్టులు చేసి, సంపాదించుకునే వారు.. కమీషన్లు దండుకునే వారిని గెలిపించుకోవాల్నా? ఏదైనా పని పడి నేతల మద్దతుకు పోతే ఇంటి గేటువుతల నిలబెట్టే లీడర్లను గెలిపించాల్నా? తెలుసుకోండి. దండం పెట్టాడని ఓటేస్తే.. మళ్లీ అయిదేళ్ల వరకు కనిపించరు. గతంలో రాజ్యమేలిన నేతలు ఏం చేశారో ఆలోచించండి. వ్యవసాయం పండుగలా సాగాలి.. చదువుకున్న వారికి ఉద్యోగాలు రావాలి.. ఉన్న ఊర్లో ఉపాధి దొరకాలి.. అన్ని కులాలు, మతాలకు భరోసా కావాలి. ఆత్మగౌరవంతో బతికేలా ఉండాలి. మీ, నా సంక్షేమాన్ని చూసుకునే మంచి నేతలు అందలమెక్కాలి. చలికాలమని లేవడానికి ఇబ్బంది పడకు.. పోలింగ్ కేంద్రానికి వెళ్లకుండా.. ఓటు వేయకుండా ఉండొద్దు. నీతిమంతులకు పట్టం కడితే నువ్వు, నేను బాగుపడతాం. మీ అంతరాత్మ సాక్షిగా ఓటేయండి. నమస్తే.. ఉంటాను.

– మీ అందరి క్షేమం కోరే మీ ఊరు

సమర్థుడికే మా ఓటు

పీపుల్స్ ఎజెండా



రాయికల్: సమస్యల పరిష్కారంతోపాటు సమర్థ పాలన అందించే వారికే తాము ఓటు వేస్తామంటున్నారు మహిళలు. అందుబాటులో ఉండడంతోపాటు తమ సమస్యలను ఓపికగా వినేవారికే ప్రాధాన్యం ఇస్తామంటున్నారు.

అవినీతికి అవకాశం ఇవ్వొద్దు



ఎన్నికల్లో అభ్యర్థులు ఓటు వేసేందుకు డబ్బులు, ఇతరత్రా వంటి వాటి ప్రలోభాలకు గురిచేస్తారు. గెలిచిన తర్వాత పది రెట్లు మన వద్దనే వసూలు చేస్తారు. అలాంటి వారికి అవకాశం ఇవ్వొద్దు.

– శ్వేత, రాయికల్

సమర్థులకే పెద్దపీట



సమర్థవంతమైన నాయకులుంటేనే సమస్యలు పరిష్కారమవుతాయి. ఓటు ద్వారా నాయకుడికి అవకాశం ఇస్తే మన ప్రాంతం ఐదేళ్లపాటు అభివృద్ధి చెందుతుంది. ప్రజల కోసం పనిచేసే నాయకుడినే ఎన్నుకోవాలి.

– పద్మ, రాయికల్

మంచి నాయకుడికే



మంచి నాయకుడికే ఓటు వేయాలి. సమస్యలపై అవగాహన ఉండి పరిష్కరించే వారిని గెలిపించాలి. అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. ప్రలోభాలకు లొంగి ఓటును దుర్వినియోగం చేసుకోవద్దు. ఓటును సద్వినియోగం చేసుకుంటేనే ప్రజాస్వామ్యానికి మేలు.

– పటేల్ సంధ్యారాణి, గృహిణి, రాయికల్

ఓటును అమ్ముకోవద్దు



శాసనసభ ఎన్నికల్లో అమూల్యమైన మన ఓటును డబ్బులకు అమ్ముకోవద్దు. ఒకవేళ డబ్బు తీసుకున్నట్లయితే సదరు ప్రజాప్రతినిధి మనం చెప్పిన మాటలు ఎవరు కూడా నమ్మరు. నిజాయితీగా ఓటు వేస్తే సమస్యలపై ప్రశ్నించవచ్చు.

– వాసం అనురాధ, రాయికల్

ప్రజల కోసం పనిచేయాలి



ఓటు వజ్రాయుధం. సరైన నాయకుడిని ఎన్నుకోవడానికి ఓటును ఉపయోగించుంటా. స్వార్థపరులను గెలిపిస్తే అవినీతి పెరిగిపోయే అవకాశం ఉంది. ప్రజా సమస్యలను పరిష్కరించే సత్తా ఉన్న అభ్యర్థికే నా ఓటు.

– శ్రీలత, రాయికల్

నిస్వార్థంతో పనిచేయాలి



నిస్వార్థంగా పనిచేసే వ్యక్తికే ఓటు వేయాలి. కుటుంబం, బంధుప్రీతి చూపకూడదు. కొందరు స్వార్థంతో ప్రజల బాగోగుల గాలికొదిలేసి ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారు. అలాంటివారికి ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలి.

– శ్రీదేవి, రాయికల్

ఆలోచించి ఓటేయాలి



ఓటు మన ప్రాథమిక హక్కు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలి. ఐదేళ్లు పాలించే ప్రతినిధిని ఎన్నుకునేటప్పుడు ఆలోచించి ఓటేద్దాం. నిస్వార్థంగా నిజాయితీతో పనిచేసే వారిని ఎన్నుకోవాలి. ప్రలోభాలకు లొంగకూడదు.

– కట్టకోల మౌనిక, రాయికల్

ప్రజల కోసమే పనిచేయాలి



ప్రజల కోసం పనిచేసే వ్యక్తిని గెలిపించేందుకు కృషిచేస్తా. స్వార్థ పరులను చట్ట సభలకు పంపితే అవినీతి పెరిగిపోయే అవకాశం ఉంది. ప్రజా సమస్యలను పరిష్కరించే సత్తా ఉన్న అభ్యర్థికే నా ఓటు వేస్తాను.

– గుర్రాల సుభాషిణి, రాయికల్

క్లుప్తంగా

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరిపై కేసు

రాయికల్: పట్టణంలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ఓటర్లకు భోజనం ఏర్పాటు చేసిన సాయి క్యాటరింగ్ యజమాని అనుపురం చిన్నలింబాద్రి, పట్టణానికి చెందిన మ్యాకల కాంతారావుపై ఫ్లయింగ్ స్క్వాడ్ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో కేడీసీసీ మాజీ డైరెక్టర్ మృతి


రాజ్‌కుమార్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం: వేములకుర్తి గ్రామంలో కేడీసీసీ మాజీ డైరెక్టర్ ఆరె రాజ్‌కుమార్(45) బుధవారం విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. తన కోళ్ల ఫారం వద్దకు ఉదయం వెళ్లాడు. విద్యుత్ సరాఫరా లేకపోవడంతో ఫారం వద్దున్న 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద టెస్టర్‌తో కరెంట్ సరాఫరా ఉందా లేదా అని టెస్టర్ ద్వారా పరిశీలించారు. విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురున్నారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. రాజ్‌కుమార్ కొద్ది రోజుల క్రితం బీజేపీలో చేరి కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి అర్వింద్‌కు మద్దతుగా కార్యకర్తలతో కలిసి ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, నిజామాబాద్ ఎంపీ, బీజేపీ కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మపురి అర్వింద్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు వేరువేరుగా నివాళి అర్పించారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి


రాజవ్వ(ఫైల్)

ఇబ్రహీంపట్నం: ఎర్దండి గ్రామంలో బుధవారం మాజీ సర్పంచ్ దాసరి రాజవ్వ(50) అనారోగ్యంతో మృతిచెందింది. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆసుపత్రికి తీసుకెళ్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు రాజవ్వ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అక్షరాలా.. రూ.50 కోట్లు

- ప్రచారంలో మహిళా సంఘాల హవా
- గల్లీ నుంచి ఢిల్లీ పెద్దల సభల దాకా..
- సభల విజయవంతంలో కీలక పాత్ర

కోరుట్ల: గల్లీ నుంచి ఢిల్లీ పెద్దల దాకా ఏ సభ చూసినా మహిళా సంఘాలదే హవా. ప్రధాన పార్టీల ప్రచార పర్వంలో ఈ ఎన్నికల్లో మహిళా సంఘాల పాత్ర కీలకంగా మారింది. క్షేత్రస్థాయిలో మహిళలు లేకుండా ఏ సభ సక్సెస్ కాలేదంటే అతిశయోక్తి కాదు. కీలక నేతల సభలకే కాదు.. ఇంటింటికి తిరిగి పార్టీలకు ప్రచారం చేయడంలోనూ మహిళా సంఘాల సభ్యులు హుషారుగా పాల్గొన్నారు. జగిత్యాల జిల్లాలోనూ ప్రధాన పార్టీల ప్రచార పర్వంలో ఇదే సీన్ కనిపించింది. ఎన్నికల ప్రచార పర్వం ముగిసినా.. పోలింగ్ ఏజంట్లుగా, పోలింగ్ బూతుల ముందు ప్రచారంలోనూ వీరిదే కీలక పాత్ర కానుంది.

రూటు మార్చిన పార్టీలు

గతంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీల కార్యకర్తలు, నాయకులతోనే జరిగిన ప్రచారం.. ఈసారి మహిళా సంఘాల సభ్యులతోనే ఉరుకులు.. పరుగులు పెట్టిందనడంలో సందేహం లేదు. మహిళా సంఘాలను ప్రచారంలో దించడానికి, సభలు, సమావేశాలకు తరలించడానికి ప్రధాన పార్టీలిచ్చిన డబ్బులు కీలకంగా పని చేశాయన్న అంశం బహిరంగ రహస్యంగా మారింది. ఈ విషయంలో ఏ పార్టీ ఇంకొకరికి తీసిపోలేదు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి సెగ్మెంట్లలోని మొత్తం ఓటర్లలో మహిళల ఓట్లు సుమారుగా 4,59,000 ఉన్నాయి. మొత్తం మహిళా ఓటర్లలో దాదాపుగా 80 శాతం వరకు మహిళా సంఘాలు, పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. ఆయా సంఘాల లీడర్ల ఆసరాతో సంఘంలోని సభ్యులకు సభలు, ప్రచారాలకు పార్టీల తీరుననుసరించి ఒక్కో మహిళకు రోజుకు రూ.100–300 వరకిచ్చారు. జిల్లాలోని కొన్నిచోట్ల కీలక నేతల ప్రచార సభలకు మహిళా సంఘాల లీడర్లు తమను పిలవలేదని సభ్యులు కొంతమంది లీడర్ల తీరుపై మండిపడ్డ సంఘటనలున్నాయి. కొన్నిచోట్ల ఇలాంటి గొడవలు బాహాటంగా జరిగి రచ్చకెక్కాయి.


ఓ సభలో పాల్గొన్న మహిళలు

రూ.50 కోట్ల పైమాటే..

పది రోజులుగా జగిత్యాల జిల్లాలోని మూడు సెగ్మెంట్లలోనూ ప్రచార పర్వం ఊపందుకుంది. ఈ క్రమంలో ప్రధాన పార్టీలకు చెందిన కీలక నేతలు జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల సెగ్మెంట్లలోని పరిసర ప్రాంతాల్లో పెద్దఎత్తున సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి తమతమ పార్టీల ప్రచారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సభలన్నింటిలోనూ మహిళలు పెద్దఎత్తున పాల్గొన్న విషయం తెలిసిందే. ఈ పది రోజుల ప్రచారంలో జగిత్యాల జిల్లాలోని మొత్తం 4.50 లక్షల మంది మహిళా ఓటర్లలో ఎంత తక్కువ అనుకున్నా 3.20 లక్షల మంది పాల్గొన్నట్లు అంచనా. పది రోజులుగా వీరికి ఒక్కొక్కరికి రోజుకు రూ.200 చొప్పున ప్రచారం కోసం దక్కినట్లు సమాచారం. ఒక్కోరోజు ఒకే మహిళా సంఘాల సభ్యులు రెండు, మూడు పార్టీల ప్రచారాల్లోనూ పాల్గొన్న సంఘటనలున్నాయి. ఈ లెక్కన ఈ పది రోజులుగా ఒక్కొక్కరికి రూ.1,500 నుంచి రూ.2వేల వరకు గిట్టుబాటయినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ లెక్కన ఎంత తక్కువ అనుకున్నా ప్రచార పర్వంలో రూ.50 కోట్ల వరకు ఖర్చు జరిగినట్లు తెలుస్తోంది.

అభివృద్ధి చేసి చూపిస్తా

- 'సాక్షి'తో కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

గొల్లపల్లి: 'ధర్మపురి నుంచి ఇప్పటికి నాలుగుసార్లు పోటీ చేసి ఓడిపోయిన. అయినా ప్రజలతో ఉన్న. ప్రజాసమస్యలపై పోరాడుతూనే ఉన్న. ఒక్క అవకాశమిచ్చి చూడండి.. అభివృద్ధి చేసి చూపిస్తా..' అని అన్నారు కాంగ్రెస్ ధర్మపురి ఎమ్మెల్యే అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్. 'సాక్షి'తో మరిన్ని విషయాలు వెల్లడించారు.


అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

సాక్షి: నియోజకవర్గ అభివృద్ధికి మీ ప్రణాళిక?

అడ్లూరి: నేను ఇదే నియోజకవర్గంలోని ధర్మారం నుంచి జెడ్పీటీసీగా గెలిచి ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ చైర్మన్‌గా పనిచేసిన. ఇక్కడి సమస్యలు చాలా తెలుసు. ధర్మపురి నృసింహాలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆలయ అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ.500 కోట్లు ఇస్తామని ప్రకటించినా.. ఇప్పటికీ హామీ నెరవేరలేదు. ఎమ్మెల్యేగా గెలిస్తే ఆలయాన్ని అభివృద్ధి చేస్తా. ఇక్కడ బస్ డిపో ఏర్పాటు చేయిస్తా. కొత్త మండలాల్లో వసతులే లేవు. పెగడపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తా.

సాక్షి: రైతుల ఇబ్బందులపై..?

అడ్లూరి: ఇక్కడ ప్రధానంగా వ్యవసాయమే ఆధారం. పండించిన పంటలో కోతలు అధికం. రైతులు ధర్నా చేసినా.. ఎవరూ పట్టించుకోలే. ధాన్యం కొనుగోళ్లలోనూ ఇబ్బందులే. ఆ పరిస్థితి రానీయను. అలాగే ప్రతి ఎకరా సాగులోకి వచ్చేలా చూస్తా.

సాక్షి: కాళేశ్వరం లింక్–2 ప్రాజెక్ట్ గురించి..?

అడ్లూరి: కాళేశ్వరం లింక్–2 ప్రాజెక్ట్ నుంచి ఇక్కడి ప్రజలకు ప్రయోజనం శూన్యం. పెగడపల్లి, గొల్లపల్లి, వెల్గటూర్ రైతులకు తీరని అన్యాయం జరిగింది. రూ.30 లక్షలు విలువ చేసే భూములకు కేవలం రూ.7లక్షల నుంచి రూ.9లక్షల పరిహారం ఇచ్చారు. బాధితులకు న్యాయం చేస్తా.

సాక్షి: మహిళల కోసం..?

అడ్లూరి: మహిళల అభివృద్ధికి కుటీర పరిశ్రమలు తీసుకొస్తాను. వారి ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తా. కాంగ్రెస్ పార్టీ ప్రకటించినట్లు వారికి అన్ని విధాలా న్యాయం చేస్తాం.

సాక్షి: జంగల్‌నాలా ప్రాజెక్టుపై మీ వైఖరి..?

అడ్లూరి: ఐదు వేల ఎకరాల ఆయకట్టు ఉన్న జంగల్‌నాలా పునరుద్ధరణను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. రైతులు ఏటా ఇబ్బంది పడుతున్నారు. మా ప్రభుత్వం రాగానే ఈ ప్రాజెక్ట్‌కు కాళేశ్వరం లింక్–2 నుంచి పైప్‌లైన్ వేసి రైతుల కష్టాలు తీరుస్తా.

ప్లీజ్.. నన్ను అమ్ముకోకండి

- ఓటు అంతర్మథనం

రాయికల్(జగిత్యాల): ఓటరు మహాశయులారా.. నాదో విన్నపం. ఐదేళ్లకోసారి నిర్వహించే అసెంబ్లీ ఎన్నికలోనే నేనే ప్రధాన పాత్రధారి. అలాంటి నన్ను అన్ని రాజకీయపార్టీలు తమ అవసరాలకు వాడుకుంటున్నాయి. నా విలువను రూ.500 నుంచి రూ.రెండు వేలు.. ఆపైనా కూడా నిర్ధారిస్తున్నారు. ఇది ఎంతవరకు సమజసం. నా విలువను వెలకట్టే వాళ్లు రేపు నీకేమన్న అయితే గుర్తు చేసుకుంటారా..? ప్రతిరోజూ నా గుర్తుకే ఓటు వేయాలంటూ నీ చుట్టూ తిరుగుతున్నారు అన్ని పార్టీల నాయకులు. వారికి నీలో కనిపించేదే నేను. నీ చేతిలో ఉన్న వజ్రాయుధాన్ని. అలాంటి అమూల్యమైన ఓటును ఐదేళ్లకోసారి వినియోగించుకునే అవకాశాన్ని రాజ్యాంగం కల్పించింది. దానిని కొందరు నాయకులు ఎన్నికలు రాగానే వెలకడుతున్నారు. ఒక్కొక్కరు ఒకలా మార్చుకుంటున్నారు. కొందరు డబ్బులతో.. మరికొందరు మద్యంతో కొంటున్నారు. ఇది నాకెంతో బాధ కలిగిస్తోంది. నామీద పెట్టుబడి పెట్టి అమ్మేసిన వారు తీరా గెలిచాక మీ దగ్గర ముక్కుపిండి వివిధ పన్నుల రూపాల్లో వసూలు చేస్తారు జాగ్రత్త. ప్రజలకు మంచి చేసే నిజాయితీపరులకు ఉపయోగించే నన్ను ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్ముకోకండి. నిజాయితీపరుడైన నాయకుడిని.. ప్రజల కోసం పనిచేసే నాయకుడిని నా వజ్రాయుధంతో ఓటువేసి మంచి ఫలితాలు రాబట్టుకోండి. అంతేగాని దయచేసి నన్ను మాత్రం అమ్ముకోకండి ప్లీజ్.

– ఇట్లు మీ ఓటు

గల్ఫ్ బాధితుడి వైద్యానికి రూ.1.32 లక్షలు సాయం

ధర్మపురి:కుటుంబపోషణ భారం కావడంతో దుబాయికి వెళ్లిన ఓ కార్మికుడు అక్కడా ఉపాధి లేక తిరిగి వచ్చాడు. రాగానే బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యాడు. దీంతో కాలు, చేయి పడిపోయింది. ఆయన వైద్య ఖర్చుల కోసం సామాజిక మిత్రులు రూ.1.32 లక్షలు సాయం అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ధర్మపురి మండలకేంద్రంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన దివిటి సురేశ్‌కు భార్య, కూతురు ఉన్నారు. కుటుంబ పోషణ కోసం ఆర్నెల్ల క్రితం దుబాయి వెళ్లాడు. అక్కడ సరిగా పని దొరక్క పోవడంతో స్వగ్రామానికి వచ్చాడు. నాలుగు నెలల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురి కాగా కాలు, చేయి పడిపోయి మంచానికే పరిమితమయ్యాడు. అప్పు చేసి వైద్యం చేయిస్తున్నా పూర్తిగా నయం కావడంలేదు. డబ్బులు లేకపోవడంతో వైద్య సేవలు మధ్యలోనే నిలిచిపోయాయి. ఆయన దీనస్థితిని తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ ఈనెల 4న ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసి సాయం అందించాలని కోరారు. స్పందించిన తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు రూ.1.32లక్షలను సురేశ్ భార్య రాణి బ్యాంకు ఖాతాకు పంపించారు. ఆ మొత్తాన్ని రమేశ్ బుధవారం స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజర్ రవితేజ చేతులమీదుగా సురేశ్ భార్యకు అందించారు. దాతలకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


దాతలు అందించిన విరాళాన్ని పంపిణీ చేస్తున్న మేనేజర్

అభివృద్ధి జాడ లేదు.. పర్యాటకం కానరాదు


- జాడ లేని ప్రగతి పరుగులు
- చారిత్రక ఆనవాళ్లు ఉన్నా పట్టింపు కరువు
- ఆధ్యాత్మికంపైనా తీవ్ర నిర్లక్ష్యం
- రామగుండంపై అధికార యంత్రాంగం అశ్రద్ధ


సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

రామగుండం: సహజ వనరులకు కొదవ లేదు.. శ్రామిక శక్తికి ఏలోటూ లేదు.. స్థలం కొరత అంతకన్నా లేదు.. నిధుల విడుదలలో ఏమాత్రం జాప్యం కావడంలేదు.. ఉన్నదంతా నిలువెల్లా అధికార యంత్రాంగం నిర్లక్ష్యమే.. అందుకే రామగుండం పారిశ్రామిక ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది.

తొలి థర్మల్ విద్యుత్ రామగుండంలోనే..

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే తొలి థర్మల్ విద్యుత్ కేంద్రం రామగుండంలోనే నిర్మించారు. అంటే రామగుండం పారిశ్రామి ప్రాంతం ప్రాధాన్యత ఎంతఉందో అర్థం చేసుకోవచ్చు.
- ఎన్టీపీసీ, బీ–థర్మల్, రైల్వేస్టేషన్, సింగరేణి బొగ్గు గనులు, ఎరువుల తయారీ కంపెనీ, సిమెంట్ కంపెనీ తదితర పరిశ్రమలు రామగుండం పేరిట స్థాపించారు.
- రాముడు సీతను నడియాడిన నేల కూడా ఇక్కడే ఉంది.
- రాముడు–సీతాదేవి సంచరించిన ఆనవాళ్లు ఇంకా చెక్కు చెదరకుండా ఉన్నాయని చరిత్రకారులు చెబుతున్నారు.
- ఇందుకు నిదర్శనంగా భక్తులు ఆయా ప్రాంతాలను దర్శించుకొని పునీతులవుతున్నారు.


రామునిగుండాలు


కనువిందు చేస్తున్న జలపాతం

పర్యాటకంపై దృష్టి సారిస్తే..

పట్టణ సమీపంలోని రామునిగుండాల ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉంది. రామలక్ష్మణుడు, సీతాదేవి ఇక్కడ సంచరించినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ఈ కొండపై 108 గుండాలు ఉండగా ఇందులో ఒకగుండం 200 అడుగుల లోతు, 50 అడుగుల వెడల్పుతో ఓలోయ ఉంది. రాముడు ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు పాదముద్రల స్థానంలో ఏర్పడిన గుంతలు గుండాలుగా మారి రామగుండంగా పేరు వచ్చిందని చరిత్రకారులు చెబుతున్నారు. 108 గుండాల్లో అన్నికాలాల్లోనూ నీరు సమృద్ధిగా లభిస్తూ ఉండడం ఇక్కడి విశేషం. ఇందులో ప్రధానమైనవి పాలగుండం, నేతిగుండం, జీడిగుండం, పసుపుగుండం, తొక్కుడుగుండం, యమగుండం, ధర్మగుండం, మోక్షగుండం ఉన్నాయి.

కొండపై లోయ.. సొరంగం..

- రామునిగుండాల కొండపై లోయ మధ్యలో సొరంగ మార్గం ఉంది. దీనిని యమకోణమని పేర్కొంటారు.
- ఈ సొరంగం గుండా నిత్యం నీరు పారుతూ ఉంటుంది.
- ప్రతీ శ్రావణ, కార్తీకమాసంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీసీతారామ లక్ష్మణులను దర్శించుకుంటారు.
- ఇంతటి ప్రాధాన్యం కలిగిన రామునిగుండాలను పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ఎవరూ ఆసక్తి చూపడంలేదు.
- కొత్త జిల్లాల ఆవిర్భావం సందర్భంగా రామగుండం ప్రాధాన్యం గుర్తించి దీని పేరిటనే జిల్లా కేంద్రం ఏర్పాటు చేస్తారని భావించినా జాబితాలో ఆ పేరు లేకపోవడంతో ప్రజలు అసంతృప్తికి లోనయ్యారు.

అభివృద్ధికి ఆమడదూరం



రామునిగుండాలను అభివృద్ధి చేసేందుకు అటవీ భూముల సాకుతో అభివృద్ధికి నోచుకోకపోవడం లేదు. ఆధ్యాత్మిక చరిత్ర కలిగిన ప్రాంతాలను వివక్ష లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి చేయాలి. ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అర్హత ఉన్నా పాలకుల ఆధిపత్య ధోరణితో అభివృద్ధికి దూరంగా ఉంది.

– భట్టు ప్రసాద్, పట్టణవాసి

అవకాశం ఉన్నా..



రామగుండం పేరిట ఉన్న ప్రతీ పరిశ్రమకు సామాజిక బాధ్యత పథకం (సీఎస్ఆర్) కింద నిధులు విడుదల చేసి అభివృద్ధి పరిచే అవకాశం ఉంది. కానీ తమ స్వార్థ రాజకీయాల కోసం ఇక్కడి పరిశ్రమల నుంచి వచ్చే సీఎస్ఆర్ నిధులను పాలకులు వేరే ప్రాంతాలకు తరలించుకెళ్లారు. ఏ ప్రాంతమైనా ఆధ్యాత్మిక, పర్యాటకంగా అభివృద్ధి చేస్తే అన్ని రంగాలు ప్రగతి సాధిస్తాయి.

– ముస్త్యాల శంకర్‌లింగం, పట్టణవాసి

మూలనపడ్డ ప్రణాళిక..

రామునిగుండాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అప్పటి మున్సిపల్ పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. ఈక్రమంలో 2007లో అప్పటి మున్సిపల్ చైర్మన్ రామునిగుండాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఇస్కాన్ సంస్థను సంప్రదించారు. రూ.200 కోట్ల అంచనా వ్యయంతో హైదరాబాద్‌లోని బిర్లా మందిర్ తరహాలో దేవాలయం, కొండకింద నుంచి పైకి రోప్‌వే నిర్మాణం తదితర పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇస్కాన్ ప్రతినిధులు కూడా క్షేత్రసందర్శనకు రాగా అటవీశాఖ అధికారుల అభ్యంతరంతో అభివృద్ధికి ఆటంకాలు ఎదురయ్యాయి. భూ వివాదాస్పద అంశాలతో ఇస్కాన్ సంస్థ ముందుకు రాలేదు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది


రిటర్నింగ్ కార్యాలయం టెంట్ల కింద సామగ్రితో పోలింగ్ సిబ్బంది

గోదావరిఖని: రామగుండం రిటర్నింగ్ కార్యాలయం నుంచి పోలింగ్ సిబ్బంది ఆయా గ్రామాలు, పోలింగ్ బూత్‌లకు బయలుదేరారు. గురువారం నిర్వహించే ఎన్నికల కోసం ఈవీఎంలు, ఇతర సామగ్రితో పయనమయ్యారు. రామగుండం నియోజకవర్గంలో 116 లొకేషన్లలో 260 పోలింగ్ బూత్‌లున్నాయి. పోలింగ్ కోసం సుమారు 1500మంది సిబ్బంది, వెయ్యి పోలీసులను వినియోగిస్తున్నారు. నియోజకవర్గంలో 2,21లక్షల మంది ఓటర్లుండగా, ఈసారి 80శాతానికి పైగా ఓటింగ్ లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. గతంలో 71శాతం పోలింగ్ జరిగింది. ఈసారి 15వేలకు పైగా కొత్త ఓటర్లున్నారని అధికారులు వెల్లడించారు. ఓటేసేందుకు వచ్చే ఓటర్లు ఓటర్ స్లిప్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని కోరారు. నియోజకవర్గ ఓట్ల లెక్కింపు మంథని జేఎన్‌టీయూలో ఉంటుందన్నారు.


ఈవీఎంలతో వెళ్తున్న ఉద్యోగులు


బందోబస్తు సమీక్షిస్తున్న డీసీపీ చేతన

గందరగోళంగా పోస్టల్ బ్యాలెట్ వినియోగం

- ఎన్నికల అధికారులతో ఉపాధ్యాయ ఓటర్ల వాగ్వాదం
- ఎట్టకేలకు ముగిసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్


అధికారితో ఉపాధ్యాయుల వాగ్వాదం

పెద్దపల్లిరూరల్: పోస్టల్ బ్యాలెట్ వినియోగం ఈసారి ఎన్నికల్లో కొంత గందరగోళానికి దారితీసింది. పోస్టల్ ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు తమకు ఓటేసే అవకాశం ఎందుకు ఇవ్వడం లేదంటూ ఎన్నికల అధికారులతో వాగ్వాదానికి దిగారు. పెద్దపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్‌లో తమ పేర్లు ఎందుకు లేవని, తాము చేసుకున్న దరఖాస్తులు ఏమయ్యాయో చెప్పాలంటూ ధర్మారం మండలానికి చెందిన కొందరు ఉపాధ్యాయులు ఎన్నికల అధికారులతో వాదనకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని శాంతింపజేశారు. అయితే ఉపాధ్యాయుల సొంత గ్రామం ఓ నియోజకవర్గం.. పని చేసే ప్రాంతం మరోచోట.. ఎన్నికల విధులు నిర్వహించేది మరోటి కావడం వల్లే ఎన్నికల అధికారుల సమన్వయ లోపంతోనే ఇలా జరిగిందని ఓ అధికారి పేర్కొన్నారు. అయితే వీరైనంత మేర మళ్లీ ఉపాధ్యాయుల నుంచి ఫారం12డీ తీసుకొని ఓటు హక్కును కల్పించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని కేంద్రంలో 1,117 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించుకున్నట్లు అధికారులు వివరించారు.

గడువు పెంచాలని డిమాండ్

ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగ, ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు గడువు పెంచాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు అశోక్ రెడ్డి, రాంకిషన్‌రావు, లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఎన్నికల అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. పోస్టల్ బ్యాలెట్ కోసం 15రోజుల క్రితమే దరఖాస్తు చేసుకున్నా.. ఓటు హక్కు వినియోగించుకోకుండా ఎందుకు చేశారన్నది అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు ఉద్యోగ, ఉపాధ్యాయులకు డిసెంబర్ 2 దాకా ఓటు వేసే అవకాశాన్ని ఇవ్వాలన్నారు.

గుండెపోటుతో మున్సిపల్ సీనియర్ కాంట్రాక్టర్ మృతి

జ్యోతినగర్: గుండెపోటుతో మున్సిపల్ సీనియర్ కాంట్రాక్టర్ గద్దం(సుందిల్ల) నారాయణగౌడ్(59) బుధవారం మృతిచెందాడు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలో నివసిస్తున్న రామగుండం మున్సిపల్ సీని యర్ కాంట్రాక్టర్ నారాయణగౌడ్ ఉదయం అస్వస్థతకు గురి కాగా.. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు చికిత్స అందించే లోపు మృతిచెందాడు. మృతుడికి భార్య విజయతో పాటు ఇద్దరు కుమార్తెలున్నారు. పలువురు కాంట్రాక్టర్లు, గౌడ సంఘం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.